సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 7 । జూన్ । 2023



రామప్ప చెరువు పరిశీలన

జూలపల్లి: చెరువుల పండుగను తెలుకుంటలోని రామప్ప చెరువు వద్ద నిర్వహించేందుకు ఇరిగేషన్ డీఈఈ శుభకిశోర్ ఎంపీడీవో వేణు గోపాల్‌రావుతో కలిసి పరిశీలించారు.



ఉపాధ్యాయులకు ఇస్రో శిక్షణ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) టీజీటి/పీజీటీ ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనుంది.

8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/30.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కబోత పెరుగుతుంది. వేడి గాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

జేఎన్‌టీయూలో క్యాంపస్ ట్రైనింగ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

కమాన్‌పూర్(మంథని): సెంటనరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూలో ఆరు రోజులపాటు నిర్వహించే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెనింగ్ ప్రోగాంను కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మంగళవారం ప్రారంభించారు. జేఎన్‌టీయూ అన్ని అనుబంధ కళాశాలల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తృతీయ సంవత్సరానికి చెందిన అన్ని విభాగాల విద్యార్థులకు వర్బల్, సాఫ్ట్‌స్కిల్స్, ఆప్టిట్యూడ్, రీజనింగ్‌లో రోజుకు ఇద్దరు ఫ్యాకల్టీ విద్యార్థులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసోసియేట్ ప్రొఫెసర్ రాజీవ్, అశోక్, ఉదయ్, సిద్ధార్థ్ పాల్గొన్నారు.

డిమాండ్లు అంగీకరించేదాకా సమ్మె

పెద్దపల్లిరూరల్: తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించేదాకా సమ్మె చేస్తామని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి వెంకటేశం అన్నారు. పెద్దపల్లి రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆలయంలో మంగళవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కేసీఆర్ రేషన్‌డీలర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. నెలకు రూ.30వేల గౌరవవేతనం ఇవ్వాలన్నారు. నాయకులు మద్దెల నర్సయ్య, రాధిక, శ్రీనివాస్, ప్రభాకర్, కొమురయ్య, రమేశ్, రాజయ్య, జయప్రద, తిరుపతి, సరస్వతి, విజయ, పద్మ, రవీందర్, శంకర్ తదితరులున్నారు.

'బడిబాట' విజయవంతం చేయాలి



ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న రాజీవ్

సుల్తానాబాద్: విద్యార్థుల భవిష్యత్ కోసం తలిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సంయుక్త సంచాలకులు పి.రాజీవ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని పుసాలలో మంగళవారం జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నభోజనం, రెండు జతల యూనిఫాం ఇస్తున్నట్లు వెల్లడించారు. డీఈవో మాధవి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర శిక్ష సమన్వయకర్త ఐ.విజయ్ కుమార్, ఎంఈవో టి.సురేందర్ కుమార్, హెచ్‌ఎం కె.శశికాంత్ రెడ్డి, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో తెలిపారు. కాల్వశ్రీరాంపూర్‌లో చేపట్టిన బడిబాట ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మహిళలతో మాట్లాడుతున్న విజయ్

సుల్తానాబాద్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని 8, 9వ వార్డు అశోక్‌నగర్, మార్కండేయకాలనీ, నీరుకుల్ల రోడ్డులో గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేశాయని తెలిపారు. ధరణితో రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం సవరించకపోవడం సరికాదన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్య గౌడ్, అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, దన్నాయక్ దామోదర్ రావు, చిలుక సతీష్, నోముల శ్రీనివాస్ రెడ్డి, పన్నాల రాములు, చింతల రాజు, సునిత, దున్నపోతుల రాజయ్య, బండ తిరుపతి, ఎండీమతీన్, అమిరిశెట్టి రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

'48 గంటల లోపు చెల్లింపు' ఉత్తదే..!

- 15 రోజులైనా చేతికందని ధాన్యం పైసలు
- అప్పులు చెల్లించలేక అన్నదాతల అవస్థలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు ఓదెల మండలానికి చెందిన బారతల కుమారస్వామి. గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నెలరోజుల క్రితం 50 బస్తాల ధాన్యం విక్రయించాడు. ఇప్పటి వరకు డబ్బులు మాత్రం పడలేదు. యాసంగి పంటసాగుకు తెచ్చిన అప్పులు అలాగే ఉన్నాయి. అధికారులను అడిగితే రేపు, మాపు పడతాయంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

మాటల్లో గంటలు..

చేతల్లో తంటాలు

సాక్షి, పెద్దపల్లి: ప్రకృతి సహకరించకపోయినా.. అప్పులిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాకపోయినా.. అకాలవర్షాలు వెంటాడినా.. అన్నిరకాలుగా అరిగోస పడుతూ కాపాడుకున్న పంటను అమ్ముకుంటే తీరా ఆ డబ్బులు కూడా అందక అన్నదాతలు ఆగమవుతున్నారు. ఫలితంగా రైతులకు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి 20 రోజులు గడుస్తున్నా డబ్బులు చేతికందడం లేదు. పంటల సాగుకు.. ఇతర ఖర్చులకు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక సతమతం అవుతున్నారు. అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని అధికారులు చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడంలేదు. ధాన్యం విక్రయించి 20 రోజులు గడుస్తున్నా.. డబ్బులు మాత్రం ఖాతాల్లో జమ కావడం లేదు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

అన్నదాతలు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించింది. జిల్లావ్యాప్తంగా 300 కేంద్రాలను ప్రారంభించి 4లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 2.84లక్షల టన్నుల ధాన్యాన్ని 39,507 మంది రైతుల నుంచి సేకరించింది. ఇందుకు రూ.589 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం 14,250 మంది రైతులకు రూ.204 కోట్లు చెల్లించారు. మిగిలిన 25,237 మంది రైతులకు ఇప్పటివరకు డబ్బులు చెల్లించలేదు. ఇందులో 5,486 మంది వివరాలు ఇంకా ట్యాబ్‌లలో నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బుల చెల్లింపుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో తాము ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ నమోదులో జాప్యం

ధాన్యం కొనుగోలు చేసే సిబ్బందికి అధికారులు అందించిన ట్యాబ్‌లలో ఎదురవుతున్నా సాంకేతిక సమస్యలు, వాటిలో నమోదు చెల్లింపులను మరింత జఠిలం చేస్తున్నాయి. రైతు ధాన్యం అమ్మగానే ట్యాబ్ ద్వారా వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ధాన్యం లోడ్ చేసిన వాహనం రైసుమిల్లుకు వెళ్లగానే ట్రక్‌షీట్ వస్తుంది. తర్వాత పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆన్‌లైన్‌లో పేమెంట్ డాటా వెళ్తుంది. అయితే ట్యాబ్‌లు పనిచేయకపోవటం, నమోదులో ఆలస్యం.. తదితర కారణాలతో ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపునకు సంబంధించి సమాచారం చేరటం లేదు. అలాగే మరోపక్క ట్యాబ్‌లలో నమోదు చేసిన వారికి ప్రభుత్వం డబ్బులు విడుదల చేయకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది.

ఆది నుంచి సమస్యలే..

ఈ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రారంభించినప్పటి నుంచీ సమస్యలే. ముహూర్తాల పేరుతో కొనుగోలు కేంద్రాల ప్రారంభాన్ని ఆలస్యం చేశారు. ఆ తర్వాత అకాలవర్షంతో ధాన్యం తడిసిపోగా.. తేమ సాకుతో కొనుగోళ్లు జాప్యమయ్యాయి. తడిసిన ధాన్యం ఆరబోసి అమ్ముకుంటే తరుగు పేరుతో కటింగ్, లారీల కొరతతో లోడింగ్ కష్టాలు. అంతలో మరోసారి వర్షాలతో నెలరోజులపైనే కేంద్రాల్లో అన్నదాతలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంపై డీఎస్‌వో వెంకటేశ్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతున్న ప్రకారం రైతుల ఖాతాల్లో జమవుతున్నాయని, వారం రోజుల్లో రైతులందరికీ జమచేస్తామని తెలిపారు.

జిల్లాలో ఇలా..

ఏర్పాటు చేసిన కేంద్రాలు	303
కొనుగోలు చేసిన ధాన్యం	2,87,644 టన్నులు
మిల్లులకు తరలించిన ధాన్యం	2,84,305
ధాన్యం అమ్మిన రైతులు	39,507
ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రైతులు	34,021
డబ్బులు జమ అయిన రైతులు	14,250 (35శాతం)

అప్పు ఇచ్చినవారు ఆగుతలేరు



మండల కేంద్రంలోని సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో 20 రోజుల క్రితం వడ్లు అమ్మిన. ఇప్పటికీ డబ్బులు పడలేదు. యాసంగి పంటల సాగుకు అప్పు ఇచ్చిన వారు ఇప్పుడు ఆగటం లేదు. సార్లను అడిగితే పడతాయంటున్నారు.

– ఎల్కపల్లి లచ్చయ్య, జూలపల్లి

20 రోజులవుతోంది



ఓదెలలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం అమ్మి 20 రోజులు అవుతోంది. అకాల వర్షాలతో కొనుగోలు కొంత ఆలస్యమైంది. తరుగు పేరుతో కోత పెడుతారని భావించి తొందరగా అమ్ముకున్న. ఇప్పటివరకు పైసలు పడలేదు. వానాకాలం సీజన్ వచ్చినా జమవుతలేవు.

– తీర్థాల రాజయ్య, ఓదెల

పారిశ్రామికంగా దూసుకెళ్తున్నాం..



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఎంపీ వెంకటేశ్ నేత

- 24 గంటలపాటు విద్యుత్ సరఫరా
- 36 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు
- పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్

గోదావరిఖని: పారిశ్రామికంగా జిల్లా దూసుకెళ్తోందని ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో కలెక్టర్ సంగీత, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్యుత్, సాగు, తాగునీరు, పారిశ్రామిక, ఐటీ, వ్యవసాయ రంగంలో అద్భుత ప్రగతి సాధించామన్నారు. గతంలో పరిశ్రమలకు వారంలో మూడు రోజులపాటు పవర్ హాలిడే ఉండేదని, పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఉత్పాదక, ఐటీ, లైఫ్ సైన్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో రూ.3.36 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. 2014లో రూ.57 వేల కోట్ల ఎగుమతులు 3.23 లక్షల ఉద్యోగులు ఉన్న ఐటీ పరిశ్రమ నేడు రూ.2.41లక్షల కోట్ల ఎగుమతులు, 9.05 లక్షల ఉద్యోగాల స్థాయికి ఎదిగిందన్నారు. తలసరి ఆదాయం రూ.1.12 లక్షల నుంచి నేడు రూ.3.17 లక్షలకు చేరిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో వచ్చే పెట్టుబడులు, వాణిజ్య సంస్థల కారణంగా జిల్లా అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. టీఎస్ ఐపాస్ కింద రూ.13,724 కోట్ల పెట్టుబడితో 513 యూనిట్లకు అనుమతులు మంజూరు చేసి 5,376 మందికి అవకాశం కల్పించామన్నారు. టీ ఐడియా కింద జిల్లాలో 116 జనరల్ ఔత్సాహికవేత్తలకు రూ.29.31కోట్లు, టీ ప్రైడ్ కింద 796 ఎస్సీ ఔత్సాహికవేత్తలకు రూ.37.34 లక్షలు, 154 మంది గిరిజన ఔత్సాహికవేత్తలకు రూ.6.82కోట్లు, 82 దివ్యాంగ ఔత్సాహికవేత్తలకు రూ.4.14కోట్ల రాయితీ అందించామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. జిల్లాలో ఔత్సాహికవేత్తలు, పరిశ్రమల శాఖలో మంచి ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, ఐటీ సేవలు అందిస్తున్న వారికి ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్, రామగుండం మేయర్ బి. అనిల్ కుమార్, కేశోరాం సిమెంట్ ప్రతినిధి అరవింద్ కుమార్, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధి, ఔత్సాహికవేత్తలు, కార్మికులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

రూ.14.63 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిని సుందరంగా తీర్చిద్దేందు కు ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి అన్నారు. స్థానిక పాత మున్సిపల్ ఆఫీసులో చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రూ.14.63 కోట్ల వ్యయ అంచనాలతో కూడిన 36 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని కమిషనర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ లు, ప్రధాన కూడళ్ల సుందరీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సూచనలతో అమర్‌నగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లోని కూడళ్లతోపాటు పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ల అభ్యంతరం

మున్సిపల్ కొత్త భవనంలో రూ.40లక్షలతో ఫర్నిచర్ కొనేందుకు ప్రవేశపెట్టిన 4వ అంశం, కూడళ్ల రూ.40 లక్షలతో అభివృద్ధి చేసే తీర్మానాలను రద్దు పర్చాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, తూముల సుభాష్‌రావు, తాడూరి పుష్పకళ, నెత్తెట్ల స్వరూప డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశంలో అభ్యంతరం తెలుపుతూ తీర్మానించారు. ఈ వ్యతిరేక తీర్మానాన్ని మినిట్స్ బుక్‌లో రాయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మమతారెడ్డి

వందేభారత్ వస్తోంది..!

- రెండోసారి ట్రయల్స్ పూర్తిచేసుకున్న రైలు
- త్వరలోనే ఖాజీపేట – బల్లార్ష మార్గంలో పరుగులు
- మూడో సర్వీసుగా నాగ్‌పూర్ – సికింద్రాబాద్ రైలు
- పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్?
- ఉమ్మడి జిల్లాలో 100 కి.మీ. వేగంతో ప్రయాణం



రూట్	స్పీడు సామర్థ్యం(కి.మీ.లలో)
సికింద్రాబాద్ – బల్లార్షా	130
ఖాజీపేట – కొండపల్లి	130
సికింద్రాబాద్ – ఖాజీపేట	130
మానిక్‌నగర్ – విరూర్(3వ లైన్)	110
మందమర్రి – మంచిర్యాల(3వ లైన్)	110
మంచిర్యాల – పెద్దంపేట(3వ లైన్)	100
పెద్దంపేట – రాఘవపురం(3వ లైన్)	110
రాఘవపురం – కొలనూరు – పొత్కపల్లి(3వలైన్)	90
బిజిగిరీషరీఫ్ – ఉప్పల్(3వ లైన్)	100
పెద్దపల్లి – కరీంనగర్	100
కరీంనగర్ – జగిత్యాల(లింగంపేట)	90
జగిత్యాల(లింగంపేట) – నిజామాబాద్	100
మేడ్చల్ – మనోహరాబాద్ సెక్షన్	110

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పూర్తిస్వదేశీ సాంకేతికతతో రూపొందిన సూపర్‌ఫాస్ట్ ట్రెయిన్ వందేభారత్ ఉమ్మడి జిల్లాలో కూత పెట్టనుంది. ఈనెలలో నాగపూర్ – సికింద్రాబాద్ మధ్య రైలు ప్రారంభానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ఈరైలు రెండుసార్లు ట్రయల్ రన్ పూర్తిచేసుకుంది. సోమవారం కూడా రైలు ఎక్కడా ఆపకుండా సికింద్రాబాద్ – నాగపూర్ వరకు 100 కి.మీ. వేగంతో నడిపినట్లు తెలిసింది. మే నెలలో తొలిసారి వందేభారత్ రైలును ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో ట్రయల్ రన్ చేపట్టగా సకాలంలో గమ్యస్థానం చేరుకుందని సమాచారం. ప్రస్తుతం సికింద్రాబాద్ – విశాఖపట్నం, సికింద్రాబాద్ – తిరుపతి రూట్లలో వందేభారత్ అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా సికింద్రాబాద్ – నాగపూర్ రూట్‌లో పరుగుతో రికార్డునెక్కనుంది.

రామగుండం, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్?

అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన వందేభారత్ రైలు.. సికింద్రాబాద్ – ఖాజీపేట, ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో త్వరలో పరుగులు తీయనుంది. ఇటీవలే ఈ సెక్షన్‌లో మూడోలైన్ కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో ఈ మార్గంలో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరిగింది. ఇదే సెక్షన్ మీదుగా వందేభారత్‌ను సికింద్రాబాద్ టు నాగపూర్ వరకు ట్రయల్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ – నాగపూర్ వరకు 581 కిలో మీటర్లు. సాధారణ రైళ్లకైతే ఈ రెండు నగరాల మధ్య 10 గంటలకుపైగా సమయం పడుతోంది. వందేభారత్ రైలైతే 6.30 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకునే వీలుంది. మొన్న జరిగిన పరీక్షల్లో రైలు కేవలం ఆరుగంటల్లోనే చేరుకుందని సమాచారం. మిగిలిన అరగంటలో హాల్టింగ్‌ల సమయాన్ని తీసేసినా.. ఆరున్నర గంటల్లో చేరుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెద్దపల్లి, రామగుండం, ఉమ్మడి ఆదిలాబాద్‌లో మంచిర్యాల, కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇందులో మార్పులు కూడా ఉండవచ్చన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

ట్రాక్‌ల సామర్థ్యం పెంపు..

రైలు పరుగు పెట్టనున్న నాందేడ్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ట్రాక్‌స్పీడ్ పెంచారు. సికింద్రాబాద్ పరిధిలో ఖాజీపేట – బల్లార్ష రూట్‌ను అప్‌గ్రేడ్ చేశారు. దాదాపు 130 కి.మీ. వేగంతో ఈ మార్గంలో రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట – రామగుండం వరకు, పెద్దపల్లి – మెట్‌పల్లి వరకు కనిష్టంగా 90 కి.మీ. నుంచి గరిష్టంగా 130 కి.మీ. వరకు వేగంగా వెళ్లేలా ట్రాక్‌లు రెడీ చేశారు. భవిష్యత్తులో వందేభారత్ రైలును పెద్దపల్లి – కరీంనగర్, కరీంనగర్ – జగిత్యాల, జగిత్యాల – నిజామాబాద్ రూట్లలోనూ నడపగలిగితే.. పొరుగున ఉన్న మహారాష్ట్రకు కేవలం మూడు, నాలుగు గంటల్లోనే చేరుకునే వీలుంటుంది. సిరిసిల్ల, జగిత్యాల విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు, నేత, వలస కార్మికులకు ఇది ఎంతో అనువుగా ఉండనుంది.


జగిత్యాల రూట్‌లోనూ నడపాలి



జగిత్యాల రూట్‌లో చాలా మంది ఎక్స్‌ప్రెస్ సర్వీసు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్దపల్లి – జగిత్యాల మార్గంలో వందే భారత్ రైలు నడిపితే ముంబై వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుంది. ఇప్పుడు 10 గంటల సమయం పడుతుంది. రూ.2 వేల ఖర్చవుతుంది. వందేభారత్ వస్తే.. వేగంగా ముంబై చేరుకుంటాం, ఖర్చు తగ్గుతుంది.

– నాగిరెడ్డి రాజిరెడ్డి, హార్వెస్టర్ యజమాని, జగిత్యాల

పెద్దపల్లిలో హాల్టింగ్ ఇవ్వాలి



ఖాజీపేట – బల్లార్షా సెక్షన్‌లో వందేభారత్ రైలు రానుండటం హర్షణీయం. దీంతో స్థానికులకు చాలామేలు జరుగుతుంది. పెద్దపల్లిలో హాల్టింగ్ ఉంటుందన్న ప్రచారంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లికి హాల్టింగ్ కల్పిస్తే నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ వాసులకు అనుకూలంగా ఉంటుంది.

– కొండి సతీశ్, ఆమ్‌ఆద్మీపార్టీ

నేడు సాగునీటి దినోత్సవం

పెద్దపల్లిరూరల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం సాగునీటి దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్‌తో కలిసి సమీక్షించారు. వేడుకలో రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని, బతుకమ్మ, బోనాలతో తరలిరావాలని కోరారు. కట్టమైసమ్మకు పూజ చేయాలని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. వేడుకలకు శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. బీసీ కులవృత్తులు, చేతివృత్తుల వారు రూ.లక్ష ఆర్థికసాయం కోసం ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ధూళికట్ట వెల్‌నెస్‌కు మొదటిస్థానం

ఎలిగేడు: సబ్‌సెంటర్స్ విభాగంలో 79శాతం మార్కులతో మండలంలోని ధూళికట్ట హెల్త్ వెల్‌నెస్ సెంటర్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధి మరచి ప్రభుత్వ భూముల కబ్జా


నగేశ్

జూలపల్లి: రాష్ట్రంలో అభివృద్ధిని పక్కన పెట్టిన పాలకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం దుర్మార్గమని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ డాక్టర్ నగేశ్ అన్నారు. మంగళవారం జూలపల్లిలో మాట్లాడుతూ ఢిల్లీలో తెలంగాణ భవన్ కట్టుకున్న కేసీఆర్.. మళ్లీ రాష్ట్రంలో భారత్‌భవన్ పేరుతో భవన నిర్మాణానికి రూ.500 కోట్లు విలువ చేసే భూమిని రూ.40 కోట్లకు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. బంగారు తెలంగాణ అంటూ అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఘోర పరాజయం తప్పదని పేర్కొన్నారు.

పరిశ్రమల విద్రోహదినంగా గుర్తించాలి


మాట్లాడుతున్న గొర్రె రమేశ్

రామగుండం: రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన పారిశ్రామిక, పరిశ్రమల దినోత్సవాన్ని తెలంగాణ లేబర్ పార్టీ పరిశ్రమల విద్రోహ దినంగా భావిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్ అన్నారు. అంతర్గాంలో విలేకరులతో మాట్లాడారు. ముందుగా టెక్స్‌టైల్ మిల్లు కార్మికుల ఇబ్బందులు తెలుసుకున్నారు. దశాబ్దం క్రితం సింగరేణిలో 1.25 లక్షల పర్మినెంట్ ఉద్యోగులు పనిచేసేవారని, ప్రస్తుతం 43వేలకు పడిపోయారని తెలిపారు. 1985లో మూతపడిన స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు కార్మికులకు నేటికీ పరిహారం చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం అడ్రస్ లేదన్నారు. వేలాది ఎకరాల వ్యవసాయ భూములను సేకరించి ప్రహరీ నిర్మించి బీపీఎల్ నిర్లక్ష్యంగా వదిలేసిందని, స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ ప్రతినిధులు కొయ్యడ శివరాం, కాదాసి సాయితేజ, అఖిల్ వర్మ, జక్కం కవిత, పొన్నం రజిత, చెరుకు పైడి ఉన్నారు.

ఫిట్స్‌తో ఒడిశా కార్మికుడి మృతి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ శివారు ఇటుకబట్టీలో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కార్మికుడు గుణనిధిపోడ్ (44) ఫిట్స్‌తో మృతి చెందాడు. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బలంగర్ జిల్లా పండముండ గ్రామానికి చెందిన గుణనిధిపోడ్ భార్యతో కలిసి ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చాడు. ఇక్కడ పని ముగియడంతో సొంత గ్రామానికి వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. ఆదివారం ట్రైన్ లేకపోవడంతో బట్టీలోనే ఉండిపోయాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఫిట్స్ రావడంతో తోటి కూలీలు 108 ద్వారా స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గుణనిధిపోడ్‌కు భార్య కుమారి, కూతురు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో సొంత రాష్ట్రానికి తరలించారు.

ఉపాధ్యాయులకు ఇస్రో ఆన్‌లైన్ శిక్షణ

- అంతరిక్ష సాంకేతికతపై శిక్షణ
- అనువర్తనాలపై తరగతులు
- ఈనెల 16న చివరి తేదీ



ఇస్రో శిక్షణ బ్రోచర్

జ్యోతినగర్: ఉపాధ్యాయులు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు.. అంతరిక్ష విజ్ఞానంపై అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) టీజీటీ/పీజీటీ ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనుంది. ఈ మేరకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇస్రో పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఐఆర్‌ఎస్) డెహ్రాడూన్ వారు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక శిక్షణ కోర్సును సిద్ధం చేశారు. తరగతుల నిర్వహణకు గతనెల 29 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈనెల 16న సాయంత్రం ఐదు గంటలకు రిజిస్ట్రేషన్ అవకాశం ముగియనుంది.

ఈనెల 19 నుంచి ఆన్‌లైన్ తరగతులు

2007లో 312 మంది అభ్యర్థులతో ప్రారంభమైన శిక్షణ ఇప్పటివరకు 170 సార్లు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 6 లక్షల మంది అభ్యర్థులు/ఉపాధ్యాయులు పాల్గొని అంతరిక్ష విజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా విజయవంతంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేందుకు ఇస్రో చర్యలు చేపట్టింది. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ఇంటర్నెట్‌లో https:///www.iirs.gov.in/EDUSAT-news లింక్ ద్వారా మొబైల్, జీమెయిల్, పేరు, ఉద్యోగ అర్హతలు, పనిచేస్తున్న పాఠశాల తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న వారికి ఈ నెల 19 నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రారంభమై 23వ రకు నిర్వహించనున్నారు. ఇందులో 60 శాతం హాజరు నమోదు ఉంటూ, ప్రతిభ చాటిన ఉపాధ్యాయులకు ఇస్రో నుంచి మెయిల్ ద్వారా ధ్రువీకరణపత్రం అందించనున్నారని జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావు తెలిపారు. స్పేస్ క్రాఫ్ట్ సిస్టం, ప్లానెటరీ సైన్స్, ఆర్థిక, సామాజిక అభివృద్ధి, వాతావరణ సమాచారం, దూరవిద్య, పర్యావరణం, శీతోష్ణస్థితిపై అధ్యయనం, ఆహారం, నీటి భద్రత, ప్రకృతి వైపరీత్యాలు అనే ఉప అంశాలపై పూర్తిగా అవగాహన కల్పించేలా తరగతులు ఉంటాయి.

ఉపాధ్యాయులకు మంచి అవకాశం



ఉపాధ్యాయులకు ఇస్రో అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ గల శాస్త్రవేత్తల పరిజ్ఞానంతో రూపొందించిన అంశాలను శిక్షణలో బోధించనున్నారు. అత్యుత్తమ ఆన్‌లైన్ శిక్షణను ఉపయోగించుకుని విద్యార్థులకు తెలియజేసి వారి భవిష్యత్తును బంగారుమయం చేసే అవకాశాలు ఉన్నాయి.
– బి.రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి

బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి


ఆకాంక్ష మృతదేహం

గోదావరిఖని: బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న గోదావరిఖనికి చెందిన ఆకాంక్ష (25) సోమవారం అనుమానాస్పద స్థితిలో ఇంట్లో మృతి చెంది కన్పించడం స్థానిక మేదర్‌బస్తీలో విషాదం నింపింది. బస్తీకి చెందిన వ్యాపారి జ్ఞానేశ్వర్ పెద్ద కూతురు ఆకాంక్ష బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తోంది. కొన్నిరోజులు హైదరాబాద్‌లో పనిచేసిన ఆమె బెంగళూరులోని కోడిహళ్లి జీవన్ బీమానగర్‌లోని ఓ అద్దెఇంట్లో స్నేహితురాలి తో కలిసి ఉంటోంది. స్నేహితురాలు బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ముందుగా ఆత్మహత్యగా భావించినప్పటికీ తర్వాత హత్యగా గుర్తించినట్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో పనిచేసిన సమయంలో పరిచయమైన స్నేహితుడే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రచారం. ఈ విషాద ఘటనతో ఆమె కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఆమె మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు బెంగళూరుకు వెళ్లారు.

డిమాండ్లు నెరవేర్చాలని నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల అలవెన్స్‌పెంపుపై త్వరితగతిన చర్చించాలని, కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యునైటెడ్ ఫోరం నాయకులు యాజమాన్యానికి సూచించారు. ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 12 డిమాండ్లతో యాజమాన్యానికి గత నెల 15న సమ్మె నోటీస్ అందించామని, అయినా కంటితుడుపుగా చర్చలు చేపట్టి కాలయాపన చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్ సమక్షంలో చర్చలు కొనసాగిస్తున్నా.. కార్మికులకు మాత్రం న్యాయం చేయడం లేదన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరసన కార్యక్రమాలను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 7న గేట్ మీటింగ్, 8న రాజీవ్ రహదారిపై రాస్తారోకో, 9న గేట్ నంబర్–2 వద్ద నిరసన, 10న సాయంత్రం గేట్–2 నుంచి పరిపాలనా భవనం మెయిన్ గేట్ వరకు ర్యాలీ ఉంటుందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. నాయకులు ఇజ్జగిరి భూమయ్య, చిలుక శంకర్, నాంసాని శంకర్, బద్రి శ్రీనివాస్, జమీల్, చింతల సత్యం, రాధారపు రాజమల్లయ్య, శంకర్, భూషణం, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుల హక్కుల కోసం పోరాడాలి


నియామక పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: గీతకార్మికుల హక్కుల కోసం పోరాడాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి గ్రామ యూత్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌గౌడ్‌తోపాటు కార్యదర్శులకు మంగళవారం నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అనిల్ గౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు కొంరయ్యగౌడ్ తదితరులున్నారు.

అవయవదానం చేసిన ఆదర్శమూర్తి

- నేత్ర దానంతో మరో ఇద్దరికి చూపు


సరస్వతీ(ఫైల్)


పార్థివ దేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన ప్రముఖ డాక్టర్ ముత్తులింగం కూతురు సబ్బని సరస్వతీ(65) అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు పంపించడంతో పాటు వైద్య విద్యార్థుల పరిశోధనకు దోహదపడేలా మెడికల్ కళాశాలకు ఆమె పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం ఖిల్లా వరంగల్‌లో సరస్వతీ నివసిస్తున్నారు. గోదావరిఖని కల్యాణ్‌నగర్‌లో నివసిస్తున్న ఆమె తల్లి గతంలో మృతిచెందగా తల్లి పార్థివదేహాన్ని సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా సరస్వతీ కూడా తన మరణానంతరం నేత్రదానంతోపాటు అవయవదానం చేస్తానని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం అందించారు. ఈనేపథ్యంలో సరస్వతీ మరణించగా, ఆమె కోరిక మేరకు సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు అందించిన కుటుంబ సభ్యులు, ఆమె మృతదేహాన్ని వరంగల్‌లోని కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలకు దానంచేశారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల డైరెక్టర్ చిన్నపరెడ్డి సరస్వతీకి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. శరీర, నేత్రదాత ప్రతీ ఒక్కరికీ ఆదర్శమూర్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ నజియా అంజుమ్, సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు అభినందించారు.

ఆమె నేత్రాలు సజీవం


నిర్మల (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో నివసిస్తున్న ఆర్‌ఎంపీ వైద్యుడు బండి మల్లయ్య భార్య బండి నిర్మల(55) అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ సభ్యులు ఆమె నేత్రాలను సేకరించి ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ధర్మారం: మండలంలోని నందిమేడారం పంచాయతీ పరిధి నల్లలింగయ్యపల్లి శివారులో పెద్దపల్లి– ధర్మారం రహదారిపై మంగళవా రం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాలకు చెందిన మౌలానా, పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన శంకరయ్య మోటార్ సైకిళ్లపై ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

వడదెబ్బతో యువకుడి మృతి

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన కొంద్ర రమేశ్(30) యువకుడు వడదెబ్బతో మంగళవారం ఉదయం మృతిచెందాడు. తీవ్రమైన వడగాల్పులతో అస్వస్థతకు గురైన రమేశ్ ఇంట్లోనే మృతిచెందాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు అధికారులను ప్రజాప్రతినిధులను కోరారు.

ఆలయ భూములకు బహిరంగవేలం

పెద్దపల్లిరూరల్: పట్టణ పరిసరాల్లోని శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన భూములకు గురువారం బహిరంగవేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్య తెలిపారు. సర్వేనంబర్ 183 లోని 2.16 ఎకరాల తరి, 934లోని 11.24 ఖుష్కి భూమిని ఏడాది పాటు కౌలు తీసుకునేందుకు ఆసక్తిగల వారు బహిరంగహివేలంలో పాల్గొనవచ్చన్నారు. పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించే ఈ వేలంలో పాల్గొనేవారు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈవో కోరారు.

అంతర్గాంలో చోరీ కేసు నమోదు

రామగుండం: అంతర్గాం మండలపరిధిలోని టీటీఎస్ అంతర్గాంలోని ఓ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గుర్తించారు. అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. టీటీఎస్ అంతర్గాంకు చెందిన బైరెడ్డి నాగరాజు జూన్ 2న కుటుంబ సమేతంగా సింహాచలం తీర్థయాత్రకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తన ఇంటికి ఎదురుగా ఉన్న సమీప బంధువు నకరవేణి శివకుమార్ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో నాగరాజు ఇంటివైపు చూడగా తలుపులు తీసి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉందని గుర్తించి వెంటనే తన బంధువు నాగరాజుకు ఫోన్‌చేసి తలుపులు తెరిచి బీరువా పగులగొట్టి ఉందని తెలిపి అందులోని ఆస్తుల వివరాలు తెలుసుకున్నాడు. 62 తులాల వెండి, తులంన్నర బంగారం, రూ.14వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి శివకుమార్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న మంద నర్సింహారావు

గోదావరిఖని: సీఎం కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. మంగళవారం జీడీకే–5 ఓసీపీ, ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. తెలంగాణా దశాబ్ది ఉత్సవాల వేళ ఈనెల 9న శ్రీరాంపూర్ ప్రాంతాన్ని సందర్శించడం సంతోషకరమని, ఇదే వేదికగా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. కార్మికుల సొంతింటి కోసం 250 చదరపు గజాల స్థలం ఇవ్వాలన్నారు. సింగరేణి ప్రాంతంలో వేలాది ఎకరాల స్థలాలు ఖాళీగా ఉన్నాయని, ఆ స్థలాలను కార్మికులకు కేటాయిస్తే సొంతింటి నిర్మాణం చేసుకోవచ్చని పేర్కొన్నారు. సింగరేణిలో 50 వేలకుపైగా ఉన్న క్వార్టర్లలో చాలామటుకు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. మారుపేర్ల సమస్యతో సింగరేణి కార్మికులు పదివేల మందికిపైగా బాధపడుతున్నారని తెలిపారు. డిపెండెంట్ వయసు 35 నుంచి 40 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మిక వాడలకు స్వచ్ఛమైన తాగు నీరందించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్‌కమిటీ వేతనాలు అమలు చేయాలన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు మెండె శ్రీనివాస్, ఆసరి మహేశ్, సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌కే.గౌస్, ఆరేపల్లి రాజమౌళి, అన్నం శ్రీనివాస్, నంది నారాయణ, వంగల శివరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ నిరసన


నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్ శ్రీనివాస్

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధి ఏఎల్‌పీ గనిలో పనులు చేస్తున్న జేఎంఎస్ కంపెనీ తాను చేసిన పనులకు డబ్బులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్ ములుమూరి శ్రీనివాస్ మంగళవారం పన్నూర్‌లోని కంపెనీ ఎదుట నిరసనకు దిగాడు. కొద్ది నెలలుగా కార్మికులతో పని చేయించినా డబ్బులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నాడు. కంపెనీ ఇన్‌చార్జి శుక్ల ఈనెల 15లోగా సమస్య పరిష్కరిస్తానని తెలపడంతో శ్రీనివాస్ నిరసన విరమించారు. నరేందర్, చక్రి, రాజు, శ్రీధర్ ఉన్నారు.

వారసత్వ ఉద్యోగాల ఘనత కేసీఆర్‌దే


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: జాతీయ సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను తిరిగి కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. మంగళవారం దశాబ్ది ప్రగతిబాట కార్యక్రమంలో భాగంగా జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులు సైనికులతో సమానమన్నారు. దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ కుట్ర చేస్తోందన్నారు. నాలుగు బొగ్గు బ్లాకులను వేలానికి పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. నాయకులు గంగ్ర దామోదర్‌రావు, దాసరి నర్సయ్య, కనకం శ్యాంసన్, జావిద్‌పాషా, వడ్డేపల్లి శంకర్, పుట్ట రమేశ్, మంద రమేశ్, గండు శ్రావణ్, కుశనపల్లి శంకర్, మాదాసి రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించండి

కోల్‌సిటీ(రామగుండం): కార్పొరేషన్‌లోని సివిల్ కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ సుమన్‌రావుకు ఎమ్మెల్యే చందర్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్, కమిషనర్‌తో కలిసి కాంట్రాక్టర్లతో చర్చించారు. చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని, అవసరమైతే మరోసారి కౌన్సిల్ అనుమతికి ఎజెండాలో పొందుపర్చాలని సూచించారు.

రూ.1.5 కోట్లతో ఆధునిక వాహనాల కొనుగోలు

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆధునిక పారిశుధ్య వాహనాలు తెప్పిస్తున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి అన్నారు. రూ.1.5కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన కంపాక్టర్ వాహనం, జెట్టింగ్ మిషన్, చైన్ జేసీబీ యంత్రాలను మేయర్‌తో కలిసి ప్రారంభించారు. వర్షాకాలంలో అపరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్యం మెరుగుకు వాహనాలు దోహదపడుతాయన్నారు. చెత్త సేకరణకు డివిజన్‌కు ఒక ఆటో ట్రాలీ కేటాయించినట్లు తెలిపారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోలిండియాలో చెల్లిస్తున్న విధంగా హైపవర్ కమిటీ వేతనాలు అమలుచేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో స్టాండింగ్ కమిటీ ఆన్‌లేబర్ టెక్స్‌టైల్స్ అండ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 25 నుంచి 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలన్నారు. నేషనల్ హాలిడేస్, వేతనంతో కూడిన లీవులు, సిక్ లీవులు, సింగరేణి కార్మికుల మాదిరిగా కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. క్వార్టర్ అలాట్‌మెంట్ సదుపాయం కల్పించాలని సమస్యలు పరిష్కరించాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై పార్లమెంటరీ కమిటీ సింగరేణి యాజమాన్యంతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు ఇనపనూరి నాగేశ్వరరావు, దొడ్డి నిర్మల, బండారి శ్యాంసుందర్,భూమయ్య, చెన్నూరి రమేశ్, గొడుగు సమ్మయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి


బహుమతులు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అందించిన ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆకాంక్షించారు. నెలరోజులుగా నిర్వహించిన క్రీడా శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో చిన్నారులకు బహుమతులు అందించి మాట్లాడారు. కృషి, పట్టుదలతో ముందుకు సాగి క్రీడల్లో రాణించాలన్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్, బాస్కెట్‌బాల్, ఆర్చరీ, బాక్సింగ్, కరాటే క్రీడల్లో తర్ఫీదు పొందిన 150 మంది చిన్నారులకు టీషర్ట్, షార్ట్‌లు అందించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టి పనులు చేయాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని: పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టిన తర్వాతే ఉత్పత్తిపై దృష్టి సారించాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ ఆదేశించారు. మంగళవారం వకీల్‌పల్లిగనిని సందర్శించి మ్యాప్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం గనిలోకి వెళ్లి పనిస్థలాలను పరిశీలించారు. గనిలోని పనిస్థలాల్లో పనులు చేయించే ముందు సేఫ్ ఆపరేటింగ్ ప్రోసీజర్, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గనిలోని రూఫ్, సైడ్‌వాల్ రేకులు, మెస్‌తో రూఫ్‌బోల్ట్‌వేసి రక్షణ కల్పించిన తర్వాతే పనులు చేయాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా ప్రమాదాలు జరగకుండా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రక్షణ ప్రమాణాలు పాటించి ఏ ఒక్క ఉద్యోగికి దెబ్బ తగలకుండా ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. జీఎం వెంట గ్రూప్ ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ రవికిరణ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ తదితరులున్నారు.

వాహన టెండర్ల కాలపరిమితి ఆరేళ్లకు పెంచాలి

గోదావరిఖని: సింగరేణిలో వాహనాల టెండర్ల కాలపరిమితి ఆరేళ్లకు పెంచాలని డైరెక్టర్(పా) బలరాంను కోరారు. మంగళవారం గోదావరిఖని ఇల్లెందు క్లబ్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మూడేళ్ల కాలపరిమితిని రద్దుచేసి ఆరేళ్లకు పెంచాలని కోరారు. గతంలో కాలపరిమితి ఐదేళ్లుగా ఉండేదని దాన్ని మూడేళ్లకు కుదించారన్నారు. దీంతో నూతన వాహనాలు కొనుగోలు చేసి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించలేక అప్పుల పాలవుతున్నామన్నారు. వాహనాల రేట్లు, విడిభాగాల ధరలు, ఇన్సూరెన్స్, ట్యాక్స్ రెండురేట్లు అధికంగా పెరిగిందన్నారు. ఈక్రమంలో ఆరేళ్ల కాలపరిమితి పెంచాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో తెలంగాణ సింగరేణి భూనిర్వాసిత ప్రభావిత గ్రామాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగామ శంకర్, రాష్ట్ర కన్వీనర్ నడిపెల్లి రామ్‌గోపాల్‌రావు, సమ్మయ్య, కొయ్యడ శంకర్, తదితరులు పాల్గొన్నారు.